క్లుప్తంగా

'స్పందన'కు 10 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్‌–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 10 వినతులు వచ్చాయి. గోపాలపట్నం ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. జోన్‌–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ ఎర్ర చెరువు వద్ద టాస్క్‌ఫోర్స్, గోపాలపట్నం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. చంద్రనగర్‌కు చెందిన ఆరుగురు ఎర్ర చెరువు వద్ద పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.26 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

చెదల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్థాపంతో ఓ వ్యక్తి చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మాదేటి గార్డెన్స్‌లో గుప్తా(48), పవన్‌శెట్టి సావిత్రి దంపతులు నివసిస్తున్నారు. రెండేళ్లుగా నోటి క్యాన్సర్‌తో అతడు బాధపడుతున్నాడు. ఎంవీపీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న గుప్తా సోమవారం ఇంట్లో ఉన్న చెదల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మరక స్థితిలో ఉన్న భర్త నోటి నుంచి రక్తం రావడాన్ని భార్య గమనించి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుప్తా మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు ధర్మారావు

సీతంపేట: అర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఇటీవల ఇంటర్‌నెట్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 1 తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత అంతర్జాతీయ పురస్కారం వరించింది. కరీంనగర్ పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం, సన్మానం అందుకున్నారు. ఒక్క గంట వ్యవధిలో నాలుగు కవితలు రాసినందుకు తన సాహితీ ప్రతిభను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కవి, విశ్లేషకులు భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా స్వర్ణ కంకణం గౌరవాన్ని పొందారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సలహాదారులు పార్ల వేణుగోపాల్, కణిక సాహితీ ప్రక్రియ రూపకర్త రమాదేవి కొలకలూరి పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంపై ధర్మారావును స్కూల్ హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల చెంతకు వైద్య సేవలు

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మందుల వివరాలు తెలియజేస్తున్న వైద్య సిబ్బంది



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



60వ వార్డు శిబిరంలో రోగులకు కిట్లు అందజేస్తున్న నాయకులు



రోగులకు కిట్లు పంచుతున్న కార్పొరేటర్ సుధ

విశాఖ విద్య: ప్రజల చెంతకు వైద్యసేవలు విస్తరించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీ.ఎస్. కృష్ణ మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య నిపుణులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు సేవలు అందించారు. సాధారణ వ్యాధులతో పాటు, కంటి, దంత పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజనం అందించారు. కార్యక్రమంలో జియ్యాని మారుతి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

60, 61వ వార్డుల్లో..

మల్కాపురం: జీవీఎంసీ 60,61వ వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు రెండో రోజు కొనసాగాయి. 60వ వార్డు ఇందిరాకాలనీ సచివాలయం వద్ద సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు సేవలు అందించారు. 80 మందికి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోమునాయుడు, అంగ రామ్‌ప్రసాద్,జీవీఎల్ నరేష్,ఆడారి హరీష్,ఆకాల కనకరాజు,స్పందన బాబూరావు పాల్గొన్నారు.

- 61వ వార్డు మల్కాపురం గాంధీజీవీధి పరిధి సచివాలయం ప్రాంత వాసులకు మరిడిమాంబ కల్యాణ మండపం వైద్య సేవలు అందించారు.వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని రోగులకు వైద్య కిట్లు అందించారు.110 మంది రోగులు వైద్య సేవలు పొందారు.కార్యక్రమంలో నాయకులు సోమునాయుడు,వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్.రాజు, భోగవల్లి నాగభూషణం,బూస అప్పలరెడ్డి,చట్టి నూకరాజుయాదవ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డులోని 481 పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు సోమవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు చీరలు పంపిణీ చేశారు. గోపాలపట్నంలోని కుమారి కల్యాణ మండపంలోని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ దసరా, దీపావళి సందర్భంగా మహిళలకు ఈ చీరలు అందించారని తెలిపారు.కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివారావు,నాయకులు పొట్నూరు శంకరరావు, అప్పలరాజు, బి. వెంకటరావు, పసుపురెడ్డి రమణ, ఊటపల్లి గోవిందు, దేరెడ్ల సత్యనారాయణ, సీవో ఝాన్సీ, ఆర్‌పీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

5 వేల మందికి అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న అతిథులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గానగర్ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి శాఖ డైరెక్టర్, జిల్లా ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సభ్యురాలు కాయిత వెంకటలక్ష్మి రత్నాకర్, 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పాలకవర్గ సభ్యులు పాత్రపల్లి వెంకటరమణ, యలమంచలి వెంకటరావు, సానబోయిన సంపత్, పల్లా పెంటారావు, నక్కా శంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోలో మేయర్.. సైకిల్‌పై కమిషనర్

- సొంత వాహనాలు వదిలి కార్యాలయానికి పయనం
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విన్నపం



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్



ఆటోలో జీవీఎంసీకి చేరుకున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ కోరారు. మేయర్ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

ఒకరికి 5 రోజుల జైలు

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 22 మందికి జరిమానాలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం ప్రాంతాల్లో గోపాలపటం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందిపై కేసులు ఇటీవల నమోదు చేశారు. వారిని సెక్షన్ 180, 181, 185, ఎంవీ ఎక్ట్ ప్రకారం రూ.2,000 నుంచి రూ.8,000 వరకు జరిమానాలు విధించారు. కొత్తపాలేనికి చెందిన గంట్యాడ నాగభూషణానికి 5 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా వేశారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

డాబాగార్డెన్స్: దేశంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సిటూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు తదితర అన్ని తరగతుల ప్రజానీకంపై తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్ములుగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. దీంతో పాటు రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసేలా అనేక చర్యలు చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సవరణ చట్టం 2020 రద్దు చేయాలన్న డిమాండ్లతో దేశంలోని అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబర్ 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు. విజయవాడలో 48 గంటల పాటు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటూ నాయకులు కేఎం శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, సీతాలక్ష్మి, మంగశ్రీ, అప్పలరాజు, జి.శ్రీనివాస్‌తో పాటు పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న వామనమూర్తి

సీతంపేట: అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ శ్రీనివాస నగర్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి ఎర్రజెండాను ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. కార్మికులకు చట్టాలు, పనిగంటలు కావాలని దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలని మహత్తరమైన పోరాటాలు నడిపిన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద, నాయకులు రావికృష్ణ, కాంగ్రేగుల రాము, వై.వెంకట్, కేలం శివ, శేఖర్, గణేష్‌కుమార్, శంకర్, కోటి, ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్

జయప్రదం చేయాలని జేఏసీ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చేపట్టి నవంబర్ 8వ తేదీతో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పోరాటాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెయ్యి రోజులుగా కార్మికులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుతంత్రాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీని గద్దె దించి, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. విద్యార్థులు, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.ఎన్.రాజు, నాయకులు రాంబాబు, ఎల్.జె.నాయుడు, యు.నాగరాజు, అభిలాష భానుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధం



అగ్నికి ఆహుతైన బైక్

అక్కిరెడ్డిపాలెం: ఇంటి బయట పార్క్ చేసిన బైక్ అగ్నికి ఆహుతైంది. బాధితుడు, స్థానికులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ పనులు చేసుకునే బసవ సంతోష్ కుమార్, అతని తల్లి నాతయ్యపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సంతోష్ కుమార్ స్నేహితుడు ఊరు వెళ్తుండటంతో స్నేహితుడి పల్సర్ బైక్‌ను వాడుకోవటానికి తీసుకున్నారు. ఆదివారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. కొంతసమయం తర్వాత చుట్టు పక్కల వాళ్లు గట్టిగా కేకలు వేస్తుండటంతో ఏమైందని బయటకు వచ్చి చూడగా.. పల్సర్ బైక్ మంటల్లో కాలి బూడిదైంది. ఎవరైనా బైక్‌కు కాల్చారా, లేదా బైక్ నుంచి మంటలు వ్యాపించాయా అనేది తెలియలేదు. ఘటనపై బాధితుడు సంతోష్ కుమార్ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరైనా నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

రౌడీషీటర్లపై పూర్తి నిఘా

సీపీ రవిశంకర్



ఏసీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

గోపాలపట్నం: రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంచాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశించారు. వెస్ట్ ఏసీపీ కార్యాలయంతో పాటు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికరంగా తనిఖీ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నమోదవుతున్న పలు కేసులు గురించి ఆరా తీశారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కింద నమోదైన కేసులతో పాటు పలు మార్లు అరెస్ట్ అయిన ఫెడర్లపై పీడీ యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని స్టేషన్ల పని తీరుపై ఏసీపీ అన్నెపునరసింహ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరును పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని పని తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి విచారించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీసీపీ–2 ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శంగా మెలగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ జీడీ బాబు

మల్కాపురం: తెలియని వ్యక్తులు తినడానికి ఏ వస్తువు ఇచ్చినా తీసుకోవద్దని.. తల్లిదండ్రులు పలాన చోట ఉన్నారని అంటే గుడ్డిగా వారి వెంట వెళ్లకూడదని మల్కాపురం సీఐ జీడీ బాబు విద్యార్థులకు సూచించారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మల్కాపురం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు పోలీసుల త్యాగాలు, పోలీస్ విధులు తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మార్టు ఫోన్లు పక్కన పెట్టి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.చదువు వెలుగు ఇస్తుందని,ఆ వెలుగు తమను ఉన్నత శిఖరాల్లో నిలుపుతుందన్నారు.చెడు అలవాట్లుకు దూరంగా ఉంటూ ఉపాధ్యాయులు చెప్పే బోధనపై దృష్టి పెట్టి పాఠశాలకు,తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు త్వరలో పోలీస్ కమిషనర్ చేతుల మీదగా బహుమతులు అందిస్తామన్నారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతుబజారులో అధికారుల తనిఖీలు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాలపట్నం: తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం గోపాలపట్నం రైతు బజారులో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గాజువాక లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రణ అధికారి ఎస్ఎం రాధాకృష్ణ వినియోగదారులు కొనుగోలు చేసిన తర్వాత వారి సరుకులను ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు సరకులు కొనుగోలు చేసినపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూనిక యంత్రంలో సున్నాలు కనిపిస్తున్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు. వినియోగదారులకు పలు అంశాలపై అవగాన కల్పించారు. రైతులు కాటాలకు సీలు వేయించుకోవాలని సూచించారు. ప్రతీ స్టాల్‌కు వెళ్లి తూనిక యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్. ఉమాదేవి, రైతు బజారు ఈవో నారాయణరావు, సహాయకుడు శివ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తి ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక శక్తిని ఆపాలనుకునే ఇటువంటి ప్రభుత్వ పాలనను మునుపెన్నడూ చూడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 991వ రోజు, సోమవారం స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ఎన్నటికీ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరంతరాయంగా పోరాటం చేస్తునే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



విజిలెన్స్ వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవంబర్ 5 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీవో) డాక్టర్ ఎస్.కరుణరాజు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన అన్ని విభాగాలు, గనులు, లైజన్, మార్కెటింగ్ కార్యాలయాల్లోని వివిధ ప్రదేశాల్లో ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు



గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్ బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్‌బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతోపాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్, స్టేట్ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. తనిఖీలకు సంబంధించి జీఎస్టీ అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్లు తనకు చూపలేదని మంగరాజు తెలిపారు. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.